

పుస్తెలతాడు చోరీ

చిల్లర సామాన్లు కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి దుకాణంలో ఎవరూలేరని గుర్తించి ఇంట్లో దూరి మహిళపై దాడిచేశాడు. గాయపరచి పుస్తెలతాడు చోరీ చేశాడు. - 8లో



జీఎంఆర్ ఐటీలో క్రీడా సందడి

రాజాం జీఎంఆర్ ఐటీ స్పోర్ట్స్ అరేనాలో క్రీడా సందడి నెలకుంది. జాతీయస్థాయి మాస్టర్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో

సీఎం మేలు మరచిపోలేనిది

గరుగుబిల్లి: ఏపీ కేబినెట్ సమావేశంలో దేవదాయశాఖ సిబ్బంది రిటైర్‌మెంట్ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ దేవదాయశాఖ సిబ్బంది ఎం.బలరాంనాయుడు, ఎం.మురళీమోహన్ తదితరులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఇతర శాఖల ఉద్యోగులతోపాటు దేవదాయశాఖ సిబ్బంది సర్వీసును పెంచడంపై సంతోషం వ్యక్తంచేశారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధన

- డీఈఓ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పాలకొండ: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని, పాఠశాల స్థాయిలో గట్టి పునాది వేయాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ సూచించారు. పాలకొండ డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, హెచ్ఎంలతో పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాప్రణాళికపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యాకానుకలను విద్యార్థులందరికీ అందజేయాలన్నారు. నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఫేజ్-2లో పనుల కోసం అంచనాలు వెంటనే అందించాలని సూచించారు. పాఠశాలల్లో రుచికరమైన భోజనం వడ్డించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు పత్రి కృష్ణమూర్తి, కె.సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

100 అడుగుల జాతీయ జెండా



స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బెలగాం రైల్వేస్టేషన్ ఆవరణలో వంద అడుగుల జాతీయ పతాకాన్ని రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమృత్‌భారత్ పథకానికి పార్వతీపురం రైల్వేస్టేషన్ ఎంపికైందన్నారు. అందులో భాగంగా వంద అడుగుల జాతీయ పతాకాన్ని స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. రైల్వేస్టేషన్‌కు ఆధునిక సొబగులు అద్దుతున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పాటుచేసిన టికెట్, రిజర్వేషన్ల కౌంటర్లను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

ఇంటింటా... ఫీవర్ సర్వే





పార్వతీపురం మండలం దోకిశీల గిరిజన గ్రామంలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- ముందస్తు చర్యలతో వ్యాధుల వ్యాప్తి కట్టడికి సర్కారు సన్నద్ధం
- 1150 బృందాలతో ఫీవర్ సర్వే
- జిల్లాలోని 37 పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో రక్తపరీక్షలు
- లక్షణాలు ఉంటే మలేరియా, డెంగీ పరీక్షలు

పార్వతీపురంటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుతోంది. దోమలు, బ్యాక్టీరియా వృద్ధిచెంది వ్యాధుల వ్యాప్తి చెందే పరిస్థితి ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజారోగ్యమే లక్ష్యంగా.. వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేసేందుకు, రోగులకు సకాలంలో వైద్య సేవలందించే చర్యలు ప్రారంభించింది. ఓ వైపు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూనే.. ఇంటింటి ఫీవర్ సర్వేకు బుధవారం శ్రీకారం చుట్టింది. ఆశ, ఏఎన్ఎం, వలంటీర్లతో కూడిన 1150 బృందాలు గ్రామాల్లో జ్వర పీడితుల గుర్తింపు సర్వే చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ సాధారణ జ్వరాల కేసులు నమోదువుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో సోకే వ్యాధులు, వాటి లక్షణాలను, జాగ్రత్తలను వైద్య బృందాలు వివరిస్తున్నాయి. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి.

జ్వరపీడితులకు తక్షణ పరీక్షలు

జిల్లాలో ఫీవర్ సర్వేలో జ్వరం ఉన్న వారిని బృందాలు గుర్తిస్తున్నాయి. ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు మరుగైన వైద్యంకోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నాయి. అవసరమైన వారికి ప్రభుత్వాస్పత్రుల్లో మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో సాధారణ జ్వర లక్షణాలు మాత్రమే అక్కడక్కడ కనిపిస్తున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

సర్వే ఇలా...

జిల్లాలో చేపట్టిన ఫీవర్ సర్వేలో 1553 మంది ఆశవర్కర్లు, 364 మంది ఏఎన్ఎంలు నిమగ్నమయ్యారు. తొలిరోజు 2,600 ఇళ్లను సర్వే చేశారు. గ్రామాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు సర్వేలో తేలితే వెంటనే ఆయా గ్రామాలు, ప్రాంతాల్లో వైద్యశిబిరాల నిర్వహణకు వైద్యాధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో ఫీవర్ సర్వే ఇలా..

మండలాలు	15
సచివాలయాలు	350
పీహెచ్‌సీలు	37
యూహెచ్‌సీలు	5
ఆవవర్కరు	1553
ఏఎన్ఎంలు	364
ఫీవర్ సర్వే బృందాలు	1150

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా..



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టాం. 1150 బృందాలు సర్వే చేస్తున్నాయి. జ్వరం కేసులు ఉంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు వర్షకాలంలో స్వచ్ఛమైన నీరు, వేడి ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

- డాక్టర్. బి జగన్నాథరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం

గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధర



వనసహజ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి
- వనసహజ ఉత్పత్తి దారుల కలెక్షన్ సెంటర్ ప్రారంభం

సీతంపేట: గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గజిలి గ్రామంలో వనసహజ ఉత్పత్తిదారుల కలెక్షన్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.15 లక్షల వ్యయంతో కలెక్షన్ సెంటర్ నిర్మించినట్టు వెల్లడించారు. గిరిజనులు పండిస్తున్న జీడిమామిడి, పసుపు, పైనాపిల్, చెట్టుపనస, సీతాఫలం, అల్లం, చీపుర్లు, కందులు, రాగులు, ఇతర చిరుధాన్యాలను నిల్వ ఉంచి గిట్టుబాటు ధరలు వచ్చినప్పుడు విక్రయించుకునేందుకు కలెక్షన్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు సవర లక్ష్మి, పాలకొండ ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు, నాబార్డు డీడీఎం నాగార్జున, ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు, హార్టీకల్చర్ ఏడీ కె.ఎస్.ఎన్.రెడ్డి, హెచ్ఓ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితాల రూపకల్పన

- కలెక్టర్ నిషాంత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు అధికారులు, తహసీల్దార్లు, ఇతర సిబ్బందితో ఓటరు జాబితాల రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం సమీక్షించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఫారం-6 గురించి తెలియజేసి ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులు, వీఆర్వోలపై ఉందన్నారు. ఫారం-7 నోటీసును అందజేసి ఓటు హక్కును ఎందుకు తొలగిస్తున్నామో ఓటరుకు తెలియజేసిన తరువాత మాత్రమే ఓటును తొలగించాలన్నారు. ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, ఇతర జిల్లా, నియోజకవర్గంలో అదనంగా నమోదై ఉంటే క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, మెడికల్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి కొత్తగా ఓటు నమోదు చేయాలన్నారు. జేసీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, సదుపాయాలపై ఆరా తీయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉన్నదీ, లేనిదీ ఇప్పటి నుంచే తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- జిల్లా వ్యాప్తంగా 202 మిగులు సీట్లు
- 124 మందికి స్పాట్ అడ్మిషన్లు



విద్యార్థులకు అడ్మిషన్ ధ్రువపత్రాలు అందజేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

చీపురుపల్లి: ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి చీపురుపల్లి గురుకుల పాఠశాలలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ ఆధ్వర్యంలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సాగింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, నెలిమర్ల, వేపాడ, వియ్యంపేట, కొమరాడ, గరుగుబిల్లి, భామిని, వంగర తదితర గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 202 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా 124 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించి కేటగిరీ వారీగా, వారు గతంలో రాసిన అడ్మిషన్ టెస్టు ఆధారంగా వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రాణీశ్రీతో పాటు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మాటల్లేవ్.. తోపులాటే..

- పాలకొండలో టీడీపీ నాయకుల కుమ్ములాట
- బస్సుయాత్రలో వర్గపోరు బట్టబయలు
- ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న పడాల భూదేవికి అవమానం
- బస్సు ఎక్కనీయకుండా అడ్డుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ
- జయకృష్ణకు వంతపాడిన కిమిడి కళావెంకటరావు
- ఇదేమిటని నిలదీసిన ఖండాపు వెంకటరమణకు అదే ట్రీట్‌మెంట్
- ఖండాపును బస్సు ఎక్కనీయకుండా లాగేసిన జయకృష్ణ వర్గీయులు



బస్సుయాత్రలో టీడీపీ నాయకుల కుమ్ములాట

సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీ అంటే క్రమశిక్షణ... క్రమశిక్షణ అంటే టీడీపీ... అని ఆ పార్టీ అధినేత నుంచి చిన్నస్థాయి నాయకుల వరకూ పదేపదే చెబుతుంటారు! అది నేతిబీరకాయలో నెయ్యి మాదిరేనన్నది మరోసారి రుజువైంది. గత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరిగిందేమీ లేదు. సరిగ్గా ఎన్నికలకు ముందు వివిధ ప్రాజెక్టులకు నిధుల మంజూరు చేస్తున్నట్టు ప్రకటించినా అది కార్యరూపం దాల్చకుండా కాగితాలకే పరిమితమైన సంగతి ప్రజలకు తెలుసు. తర్వాత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. పెండింగ్ ప్రాజెక్టులకు వరుసగా నిధులిస్తోంది. ఆగిపోయిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పుడు వాటిన్నింటినీ తమ ఖాతాలో వేసుకోవడానికి టీడీపీ నాయకులు బస్సు యాత్ర పేరుతో సెల్ఫీల యాత్ర ప్రారంభించారు. వారి లక్ష్యం నెరవేరకపోగా ఆ పార్టీ నాయకుల మధ్య నున్న గూడుకట్టుకొని ఉన్న లుకలుకలు బట్టబయలవుతున్నాయి. క్రమశిక్షణను కాసేపు గట్టునపెట్టేసి కుమ్ములాటలో తలమునకలైపోయారు. ఇందుకు పాలకొండ నియోజకవర్గంలో బుధవారం ఆ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకటరావు సమక్షంలోనే నిమ్మక జయకృష్ణ, భూదేవి వర్గాల మధ్య జరిగిన వాదులాటే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం మండలం విక్రమపురం గ్రామం నుంచి బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు కళావెంకటరావు, పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బస్సుయాత్ర ప్రారంభానికి ఏర్పాట్లు చేసుకున్నారు. తొలుత బస్సుపైకి కళావెంకటరావు ఎక్కి కూర్చున్నారు. తర్వాత జయకృష్ణతో పాటు అతని వర్గీయులు బస్సు ఎక్కారు. టీడీపీ నుంచి పాలకొండ టిక్కెట్ రేసులోనున్న సీతంపేటకు చెందిన పడాల భూదేవి కూడా ఆ బస్సు ఎక్కేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న జయకృష్ణ అభ్యంతరం చెప్పారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన కళావెంకటరావు సైతం భూదేవిని బస్సు దిగిపోమని చెప్పేశారు. ఇదంతా గమనించిన వీరఘట్టం టీడీపీ నాయకుడు ఖండాపు వెంకటరమణ బస్సు ఎక్కి జయకృష్ణ, ఆయన వర్గీయులను నిలదీశారు. ఏదో ప్రశ్నిద్దామని ప్రయత్నించిన ఖండాపు వెంకటరమణకు భూదేవి మాదిరి అవమానమే జరిగింది. ఆయననూ జయకృష్ణ వర్గీయులు కిందకు లాగేశారు. దీంతో వారి మధ్య మాటామాట పెరిగి తోపులాటకు దారితీసింది. చివరకు వినలేని రీతిలో బూతులు కూడా తిట్టుకున్నారు. చివరకు వారి మధ్య కొట్లాటకు దారితీయడంతో పోలీసులు కలుగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. చివరకు భూదేవి, ఖండాపు వెంకటరమణ బస్సు ఎక్కకుండా కారులోనే ఉండిపోయారు.

టీడీపీలో ఇది షరా మామూలే..

పాలకొండ నియోజకవర్గంలో నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవి వర్గీయుల మధ్య ఇన్నాళ్లూ నివురుగప్పిన నిప్పులా ఉన్న పోరు బుధవారం బట్టబయలైంది. ఇన్నాళ్లూ పార్టీ కార్యక్రమాలు ఎవరికివారే వేర్వేరుగా చేసుకుంటున్న వారి మధ్య బస్సు యాత్ర కాస్త వైరం భగ్గుమనేలా చేసింది. వారం రోజుల కిందట పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పాలకొండ పంచాయితీ జరిగింది. అక్కడి నుంచి వచ్చాక జయకృష్ణ, భూదేవి వర్గాలు తమకే పాలకొండ టికెట్ కేటాయించారంటూ చెప్పుకుంటున్నారు. ఆ వైరం కాస్తా బస్సుయాత్రలో భగ్గుమంది.

జయకృష్ణది క్రిమినల్ మైండ్...



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ టికెట్ కేటాయింపుపై అధిష్టానం ఎవరికీ హామీ ఇవ్వలేదని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు తెలిపారు. పాలకొండ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బస్సు యాత్రలో తమకు జరిగిన అవమానంపై మండిపడ్డారు. పార్టీ సీనియర్ నాయకులు సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ, వారాడ సుమంతునాయుడుల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు జయకృష్ణ తీరుపై ధ్వజమెత్తారు. సీనియర్‌లను గుర్తించకుండా క్రిమినల్ మైండ్‌తో జయకృష్ణ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సొంత అజెండాతో వెళ్తున్న వ్యక్తికి బుద్ధిచెబుతామన్నారు. పార్టీ టికెట్ సీతంపేటకు చెందిన వ్యక్తులకు ఇస్తేనే ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి జయకృష్ణ వ్యతిరేక వర్గం నాయకులు పాల్గొన్నారు.

చెల్లెంపేట పరిసరాల్లో ఏనుగుల గుంపు

బలిజిపేట: మండలంలోని చెల్లెంపేట, మిర్తివలస గ్రామాల పొలిమేరలో బుధవారం ఏనుగుల గుంపు సంచరించింది. పొలాలకు వెళ్లేందుకు, అటువైపుగా రాకపోకలు సాగించేందుకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

9 మంది స్పెషలిస్టు వైద్యుల నియామకం



చీపురపల్లి సీహెచ్‌సీలో నియామకమైన ఎనస్థీయా వైద్యుడు జితేందర్ రెడ్డికి మూమెంట్ ఆర్డర్ ఇస్తున్న డీసీహెచ్ఎస్ గౌరీ శంకర్

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్‌పరిషత్ ఆస్పత్రులకు ప్రభుత్వం 9 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించింది. వీరిలో ముగ్గురు వైద్యులు బుధవారం విధుల్లో చేరారు. మిగిలినవారు ఒకటి రెండు రోజుల్లో చేరనున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతుల్లో వీరిని నియమించారు.

జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ ధికారి డాక్టర్ బి.గౌరీశంకర్ వైద్యులకు మూమెంట్ ఆర్డర్ ఇచ్చారు. డాక్టర్ జితేందర్ రెడ్డి చీపురుపల్లి సీహెచ్‌సీ(ఎనస్థీషియా విభాగం)కు, డాక్టర్ పి.అప్పారావును పార్వతీపురం జిల్లా ఆస్పత్రి (మైక్రో బయాలజీ)కు, డాక్టర్ వినోద్‌ను ఎస్.కోట ఏరియా ఆస్పత్రి (డెర్మటాలజీ)కు, డాక్టర్ శ్వేతను సాలూరు ఆస్పత్రి (గైనకాలజీ)కు, డాక్టర్ శ్రీలక్ష్మిని భద్రగిరి సీహెచ్‌సీ (గైనకాలజీ)కు, డాక్టర్ చైతన్యరాజును భోగాపురం సీహెచ్‌సీ (జనరల్ సర్జరీ)కు, డాక్టర్ సందీప్‌కుమార్‌ను పార్వతీపురం జిల్లా ఆస్పత్రి (జనరల్ సర్జరీ)కు, డాక్టర్ అపర్ణబాల పార్వతీపురం జిల్లా ఆస్పత్రి (జనరల్ మెడిసిన్ విభాగం)కు నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఇండియన్ బ్యాంకు 48వ శాఖ ప్రారంభం



ఇండియన్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేశరామన్

విజయనగరం టౌన్: పట్టణంలోని కె.ఎల్.పురం వద్ద విశాఖ జోన్ ఇండియన్ బ్యాంక్ 48వ శాఖ బుధవారం ప్రారంభమైంది. హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ.గణేశరామన్ ఈ నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.10 లక్షల కోట్లు దాటిందన్నారు. బ్యాంకింగ్‌కు సంబంధించి అన్ని ప్రామాణికతలలో ఎఫ్ఎంజీ, హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ, విజయనగరం మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట గ్రామానికి చెందిన వృద్ధురాలి మెడలో బంగారం పుస్తెలతాడు దొంగలించిన సంఘటన బుధవారం పట్టపగలే చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యపేట గ్రామానికి చెందిన బురిడి సరోజిని భర్తతో కలసి యూనియన్ బ్యాంక్‌కు మధ్యాహ్నం వచ్చారు. బ్యాంక్ పని చూసుకుని బ్యాంక్ నుండి స్వగ్రామం అప్పయ్యపేట వెళ్లడానికి ఆటో స్టాండ్‌కు వచ్చారు. మహిళను చూసి అప్పయ్యపేట వైపు వెళ్తున్నట్లు ఆటో నమ్మించి ఎక్కించారు. అప్పయ్యపేట మెయిన్ రోడ్డు దగ్గర ఆటో ఆపకుండా గ్రామ శివారున వేగంగా ఆటో నుండి దించి వెళ్లిపోయాడు. ఆటో దిగే తొందరలో దిగిన వెంటనే తన మెడలో పుస్తెలతాడు కనిపించడం లేదని గుర్తించి గొల్లుమంది. పుస్తెల తాడు పోయిందని గ్రామ పెద్ద బి.సూర్యనారాయణకు తెలియజేసింది. సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నీలకంఠం కేసు నమోదు చేశారు.

గోడ కూలి వ్యక్తి దుర్మరణం

విజయనగరం క్రైమ్: ప్రమాదవశాత్తు గోడ కూలి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి టూ టౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలం జమ్మపేటకు చెందిన పత్తికాయల అప్పలనర్సయ్య (52) కోట్లమాదప్ప వీధిలో పాడుపడిన భవనం తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో అప్పలనరసయ్య తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. టూటౌన్ ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పార్వతీపురం: సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన గొట్టాపు తాతబాబు(35)కు గత 15 రోజుల నుండి ఆరోగ్యం బాగాలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈయనకు భార్యతో పాటు పిల్లలున్నారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పిడుగు పడి ఎద్దు మృతి



కోడిశలో పిడుగు పడి మృతి చెందిన ఎద్దు

రేగిడి : మండలంలోని కోడిశ గ్రామంలో పిడుగుపడి బుధవారం ఎద్దు మృతి చెందింది. రైతు సత్యవరపు దాలప్పయ్య తన ఎద్దులను మేతకు తీసుకుని పొలానికి వెళ్లగా, ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈ సమయంలో పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. రూ.50 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు లబోదిబోమంటున్నాడు.

శాకంబరీ దేవిగా యల్లారమ్మ



శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న యల్లారమ్మ

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆద్వర్యంలో అర్చకులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జీఎంఆర్ ఐటీలో క్రీడా సందడి

- జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- అర్జున అవార్డు గ్రహీత, ఇండియా పవర్‌లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి పీజే జోసెఫ్



పోటీలు ప్రారంభిస్తున్న అర్జున అవార్డు గ్రహీత, ఇండియా పవర్‌లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి పీజే జోసెఫ్ తదితరులు

రాజాం సిటీ: రాజాం జీఎంఆర్ ఐటీ స్పోర్ట్స్ అరేనాలో జాతీయస్థాయి మాస్టర్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలను అర్జున అవార్డు గ్రహీత, ఇండియా పవర్‌లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి పీజే జోసెఫ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ స్థాయిలో నిర్వహించే వివిధ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతీయులు ఎన్నో బంగారు, వెండి పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో 80 సంవత్సరాలు పైబడిన వారు కూడా పాల్గొనడం విశేషమన్నారు. గత అనుభవాలతో జీఎంఆర్ ఐటీ అరెనా జాతీయస్థాయిలో పోటీలు నిర్వహణకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ వచ్చిన ప్రతి అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 16 వరకు జరగనున్న పోటీలకు దేశంలోని 22 రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది పోటీ దారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆఖరు రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఇందులో విజేతలు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్‌లు మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు జీఎంఆర్ ఐటీ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పవర్ లింఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకరరావు, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీ కోటేశ్వరరావు, జీఎంఆర్ ఐటీ అసోసియేట్ డీన్ డాక్టర్ జి.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీ

- నవజాత శిశువుకు అరుదైన చికిత్స



చికిత్స పొందుతున్న నవజాత శిశువు(ఫైల్)



శిశువును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అమృత ఆస్పత్రి వైద్యులు

రాజాం : రాజాంలోని అమృత ఆస్పత్రిలో వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన చికిత్సను అందించి, 9 నెలలు దాటకుండానే పుట్టిన శిశువు ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... సంతకవిటి మండలం అక్కరాపల్లి గ్రామానికి చెందిన కరగాన వసంత గర్భిణి. నెలలు నిండక ముందే పురిటినొప్పిలతో రాజాంలో అమృత ఆస్పత్రిలో మే 29న చేరింది. అంతకు ముందు పలు ఆస్పత్రుల్లో తిరిగిన ఆమెకు ఫలితం కనిపించలేదు. అమృత ఆస్పత్రి గైనికాలజిస్ట్ గార సూర్యశైలజ వెంటనే స్పందించి స్కానింగ్ ద్వారా బిడ్డ ప్రమాదకరంగా ఉందని భావించి డెలివరీ చేశారు. 800 గ్రాముల బరువుతో ఆడశిశువు జన్మించింది. నెలలు నిండకుండానే 7వ నెలలో ప్రసవం కావడంతో పాటు బరువు కూడా తక్కువగా ఉండడంతో బిడ్డ బ్రతికే పరిస్థితి కుటుంబీకులకు కనిపించలేదు. ఈ సమయంలో ఆస్పత్రి ఎండీ గార రవిప్రసాద్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్‌తో పాటు చిన్నపిల్లల వైద్యులు వావిలపల్లి అప్పలనాయుడులు 44 రోజుల పాటు వైద్యం అందించి శిశువు ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉండడంతో పాటు బరువు కూడా కేజీన్నరకు పైగా పెరిగింది. బుధవారం శిశువును తల్లిదండ్రులకు అప్పగించి డిశ్చార్జ్ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడిన వైద్యులకు, ప్రభుత్వానికి తండ్రి గౌరీశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం



ఆన్‌లైన్ తరగతులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమయ్యాయి. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సర్కారు పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. హెచ్ఎం పతివాడ త్రినాథ్, ఎంపీటీసీ సభ్యుడు మొయిద అక్కోజీ తదితరులు పాల్గొన్నారు

సేవలు పొడిగింపు

- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ–కాశీ వీక్లీ రైలు కొనసాగింపు

భువనేశ్వర్: ప్రయాణికుల ఆసక్తి దృష్ట్యా విశాఖపట్నం–బనారస్(కాశీ) మధ్య నడుస్తున్న వీక్లీ ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించినట్లు తూర్పుకోస్తా రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లలో ద్వితీయ శ్రేణి ఎయిర్ కండిషన్–1, తృతీయ శ్రేణి ఎయిర్ కండిషన్–3, స్లీపర్ శ్రేణి–12, సాధారణ శ్రేణి–2, ద్వితీయ శ్రేణి కమ్ లగేజీ, దివ్యాంగుల కోచ్‌లు–2 సౌకర్యం అందుబాటులో ఉంటాయి. ఇది విశాఖపట్నం, బనారస్ స్టేషన్ల మధ్య సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, కెసింగ, టిట్లాగఢ్, బొలంగీర్, బర్‌గఢ్ రోడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, రౌర్కెలా, హతియా, రాంచీ, మూరి, బర్కకానా, లాతేహర్, డాల్టోగంజ్, గర్వా రోడ్, డెహ్రీ ఆన్ సోన్, ససారాం, భబువా రోడ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వారణాసి స్టేషన్లలో ఆగుతుంది.

- 08588 విశాఖపట్నం–బనారస్ వీక్లీ స్పెషల్ రైలు జూలై 19నుంచి ఆగస్టు 30 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో 08587 బనారస్–విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూలై 20 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు బనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ క్రమంలో ఉభయ దిశల్లో ఈ రైళ్లు 7 సార్లు రవాణా అవుతాయి.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో (ఐటీఐ) 2023 సంవత్సరానికి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి బుధవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 1న సర్టిఫికెట్ల పరిశీలనకు ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో హాజరుకావాలని కోరారు.

మహిళపై దాడి చేసి పుస్తెలతాడు చోరీ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

సీతంపేట: చిల్లర సామాన్లు కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి దుకాణంలో ఎవరూ లేరని గుర్తించి ఇంట్లో దూరి మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పుస్తెలతాడు చోరీ చేశాడు. గాయపడిన మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బుధవారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... హడ్డుబంగి గ్రామంలో వైశ్యరాజు గోపాలరావు చిన్న దుకాణాన్ని నడుపుకుని కొన్నేళ్లుగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పటిలాగే భార్య శోభారాణిని దుకాణం చూడమని చెప్పి కొత్తూరు సామాన్లు కోసం వెళ్లాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి కచోడీలు కావాలని అడగ్గా ఇచ్చి శోభారాణి ఇంట్లోకి వెళ్లిపోయింది. ఇంటి గడియ పెట్టుకుంది. ఇదే అదనుగా కచోడీలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి మెల్లగా గడియ తీసి ఇంట్లోకి దూరి ఆమె మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నించగా శోభారాణి అడ్డుకుంది. తీవ్రంగా ప్రతిఘటించింది. దుండగుడు తనతో తెచ్చిన కత్తితో గాయాలు చేశాడు. రాళ్లతో తల, గుండెలపై మోదాడు. పిడిగుద్దులు గుద్దాడు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన వంట మనిషి చూసి కేకలు వేసింది. దగ్గరలో ఉన్న మరో దుకాణదారుడిని పిలిచింది. ఇంతలో దుండగుడు మెడలో ఉన్న పుస్తెలతాడును తెంచుకొని పారిపోయాడు. శోభారాణి భర్తకు సమాచారం ఇవ్వగా కొత్తూరు నుంచి హుటాహుటీన వచ్చి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య ఉన్న ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సేవలు చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్ఐ నీలకంఠరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డీఎస్పీ ఆస్పత్రికి వచ్చి బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బీసీలంతా ఐక్యం కావాలి

- రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు రామచంద్ర యాదవ్



సభలో ప్రజా సింహగర్జన పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ నాయకులు

విజయనగరం టౌన్: రాజ్యాధికారాన్ని సాధించేందుకు బీసీలంతా ఐక్యం కావాలని రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికారం లక్ష్యంతో ఆయన నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం విజయనగరం వచ్చిన ఆయనకు స్థానిక బీసీ నాయకుడు ఇశరపు శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక మెసానిక్ టెంపుల్‌లో జరిగిన బీసీ సింహగర్జన సభలో రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 85 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లతో అగ్రకులాలు దశాబ్దాలుగా పరిపాలన సాగిస్తున్నాయన్నారు. వీరిని ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటున్న అగ్రకులాలు వారి సంక్షేమానికి మాత్రం కృషి చేయడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితి మారాలంటే బీసీల నాయకత్వంలో రాజ్యాధికారం రావాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకుడే ముఖ్యమంత్రి కావాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో కొత్త పార్టీ ఆవిర్భవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 23న కొత్త పార్టీ ఆవిర్భావ సభకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇసరపు శేఖర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో బీసీ నాయకులు జాగరపు ఈశ్వర ప్రసాద్, మన్యాల కృష్ణ, దువ్వు చిన్నయ్య, గదుల వెంకటరావు, గోపాలరావు, రమణ, తుమ్మి లక్ష్మీరాజ్యం, ముల్లు వెంకటరమణ, విజయవాడ కార్పొరేటర్ మల్లికార్జునరావు, బండి సత్యంనాయుడు, ఇప్పిలి రాములప్పడు తదితరులు పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీసీ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఢిల్లీ బృందం సుడిగాలి పర్యటన



గొల్లాదిలో పర్యటిస్తున్న మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి మిషన్ బృందం సభ్యులు

బాడంగి: ఢిల్లీకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి మిషన్‌కు చెందిన సెక్టార్ నిపుణులు మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన జరిపారు. వీరిలో సోమేంద్ర రంజాన్ గంగూలి, సుభాష్‌కుమార్ చౌదరితో కూడిన బృందం మండలంలోని ఆకులకట్ట, పీవీ పేట, రామచంద్రాపురం, పూడివలస, డొంకినవలస, పింద్రంగివలస, కామన్నవలస, గొల్లాది గ్రామాల్లో పర్యటించింది. జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిల పనితీరు పరిశీలించారు. ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పంచాయతీల్లో సంబంధిత పనుల రికార్డుల నమోదు తీరును పరిశీలించారు. కుళాయిల ఏ విధంగా పని చేస్తున్నాయో మహిళలను అడిగి తెలుసుకున్నారు. కుళాయిలు సక్రమంగా పని చేయడాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల గురించి ఆరా తీశారు. వీరితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, ఈఈ రాజన్, డీఈఈ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి

- మాతృ మరణాలపై జిల్లా సబ్ కమిటీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. జూన్ నుండి ఇప్పటి వరకు జిల్లాలో సంభవించిన మాతృ మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అధ్యక్షతన సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో జిల్లా ఆరోగ్య కార్యాలయంలో బుధవారం సబ్ కమిటీ సమీక్ష నిర్వహించింది. సాలూరు, జియ్యమ్మవలస, మక్కువ, కురుపాం మండలాల్లో జరిగిన మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్షలో అందుకు గల కారణాలను విశ్లేషించారు. ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, సూపర్‌వైజర్, వైద్యుల ఆరోగ్య తనిఖీ వివరాలు, పరీక్షలు, పర్యవేక్షణ, ఏఏ ఆస్పత్రులకు రిఫర్ చేశారు, ఏ విధమైన ప్రమాదకర సూచికలు గుర్తించబడ్డాయి తదితర అంశాలను పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సేవలు ఎంత వరకు వినియోగించడం జరిగిందని ఆరా తీశారు. ఆయా మరణాలకు ముందస్తు చర్యలు, తిరిగి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన కార్యాచరణపై ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, కమిటీ నోడల్ అధికారి డీఐవో డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ వెంకటరమణ, ఏపిడీమియాలజిస్ట్ డాక్టర్ నవీన్, గైనకాలజిస్ట్‌లు డాక్టర్ కమలకుమారి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోజారాణి, అనస్తీస్ట్ డాక్టర్ రామారావు, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త కౌలు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్:

కౌలు రైతు చట్టం 1956ను ప్రభుత్వం రద్దు చేసి 2019 నుంచి అమలులోకి తెచ్చిన కొత్త కౌలు రైతుల విధానాన్ని అర్హులైన కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు వివరాలను విడుదల చేశారు. కొత్త కౌలు రైతు విధానం ద్వారా అందజేసే సాగు హక్కు ధ్రువీకరణ పత్రం (సీసీఆర్‌సీ) కోసం అర్హులైన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో 1,076 మంది కౌలు రైతులకు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని, ఇంతవరకు 61 శాతంతో 6,221 మందికి సీసీఆర్‌సీ కార్డులను మాత్రమే జారీ చేసామని, అందువల్ల ఈ నెలాఖరు వరకు గడువు పెంచామని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలు రైతు కార్డుల జారీ అంశం కూడా ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూయజమాని నుంచి అంగీకార పత్రం, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డులు తీసుకొని గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డులను పొందవచ్చని సూచించారు.

అ'పూర్వ' కలయిక



రాజాంలో 47 సంవత్సరాల తరువాత కలుసుకున్న విశ్రాంత ఉపాధ్యాయులు

రాజాం సిటీ: ఆరు పదులు దాటిన విశ్రాంత ఉపాధ్యాయుల అపూర్వ కలయికకు రాజాంలోని ఓ కల్యాణ మండపం బుధవారం వేదికైంది. 47 ఏళ్ల క్రితం ఉపాధ్యాయ శిక్షణ అనంతరం ఉపాధ్యాయులుగా స్థిరపడి ఉద్యోగ విమరణ కూడా చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం తేదీ నిర్ణయించుకుని ఆరు జిల్లాల్లో ఉన్న స్నేహితులంతా ఇక్కడకు చేరుకున్నారు. 1976 – 77 సంవత్సరంలో ఒమరవిల్లి డైట్ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయులంతా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులంతా ఉద్వేగంతో ఒకరినొకరు పలకరించుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయ వృత్తిలో అనుభవాలను నెమరవేసుకుంటూ పిల్లలు, వారి చదువులు, ఉద్యోగాలు వంటి అంశాలపై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక ట్రస్టు ఏర్పాటు చేసి భవిష్యత్తులో ప్రజాసేవ చేసేందుకు అంతా నిర్ణయించారు. నాటి స్నేహితులతో కలసి రోజంతా సరదాగా గడిపారు. ప్రతి ఏడాది ఇలా కలుసుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అప్పలాచారి, సత్యం, గౌరీశ్వరరావు, అసిరినాయుడు, లక్ష్మీనారాయణ, రాజారావు, గౌరీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

21న మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 1042 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. విజయనగరం, విశాఖపట్నం, తుని, హైదరాబాద్ తదితర ప్రదేశాల్లో ఉన్న మల్టీనేషన్ పరిశ్రమల్లో పలురకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు బీఐటీ.ఎల్‌వై/43బీఐవైవైఏలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ హెల్ప్ లైన్ 99888 53335, స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు 63051 10947, భానుప్రసాద్ 63034 93720, సురేష్ 79937 95796 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మనోజ్, వైఎస్సార్‌సీపీ నాయులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24 క్యా. 10గ్రా.)	59,510–00
బంగారం(22 క్యా. 10గ్రా.)	54,550–00
వెండి (కిలో)	76,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220